క్లుప్తంగా

చందవరం ఎస్సీ కాలనీలో కుక్కల బెడద

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ ఎస్సీ కాలనీలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బజారున వెళ్తున్న నలుగురిని ఇటీవల కుక్క కరవడంతో వారు తీవ్రంగా గాయపడ్డారని కాలనీ వాసులు తెలిపారు. చిన్నారులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే, రాత్రి వేళల్లో పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలంటే కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు తెలిపారు. పంచాయతీ వారికి తమ సమస్యను విన్నవించామన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వారోత్సవాలు



రోగులకు బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న సభ్యులు

పెద్దదోర్నాల: శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వారోత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సత్యబాయి సేవా సమితి సభ్యులు రోగులకు బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులతో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ వైద్య సంజీవ్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

ఏటా భూసార పరీక్షల కార్డుల పంపిణీ



భూసార పరీక్ష ఫలితాల పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

తాళ్లూరు: 2024–2025 సంవత్సరానికి రైతులకు 580 భూసార పరీక్ష ఫలితాల కార్డులు పంపిణీ చేశామని, ఏటా రైతులకు భూసార పరీక్ష కార్డులు అందిస్తామని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని మాధవరం రైతు సేవా కేంద్రంలో అధికారులు భూసార పరీక్ష ఫలితాల పత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. నేలను సారవంతం చేయాలని, తద్వారా పంట అధిక దిగుబడి వస్తుందని, భూసార పరీక్ష పథకాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ బి.రమణ, డీఏ భార్గవ్, వీఏఏలు సీహెచ్ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్

దొనకొండ: దొనకొండ తహసీల్దార్ బి.రమాదేవి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు, బుధవారం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. మండల ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సోమ, బుధవారాల్లో మాత్రమే వచ్చి అర్జీలతో కలవాలని తహసీల్దార్ సూచించారు. మిగిలిన రోజుల్లో దర్శి తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. కొమరోలులోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

రాచర్ల మండలంలో..

రాచర్ల: మండలంలోని యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా యడవల్లి, సత్యవోలు, అంకిరెడ్డిపల్లె, రంగారెడ్డిపల్లె, చర్లోపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ గిద్దలూరు డీఈ బి.శేషగిరిరావు, రాచర్ల ఏఈ బాలగురవయ్య తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

రెండో విడత భూ రీసర్వే ప్రారంభం

మార్కాపురం: మండలంలోని నరసింహాపురం, బడేఖాన్‌పేట గ్రామాల్లో 2వ దశ భూముల రీసర్వే ప్రారంభమైనట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో రీసర్వే తీరును తహసీల్దార్ పరిశీలించారు. గ్రామ పరిధిలోని పోలేరమ్మగుడి వెనుకభాగాన ఉన్న కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల ప్లాట్లు, గృహాలు నిర్మించకుండా ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించారు. కొందరు ప్లాట్లను విక్రయించినట్లు స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తల్లిదండ్రులూ..తస్మాత్ జాగ్రత్త!

- అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్న మైనర్లు
- ద్విచక్ర వాహనాలు ఇవ్వక పోవడమే మేలంటున్న అధికారులు
- వాహన యజమానికి 3 వారాల జైలుశిక్ష తప్పదంటున్న పోలీసులు



బైకుపై వెళ్తున్న మైనర్లు

పెద్దదోర్నాల: విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. ఇకపై నెల రోజుల పాటు ఇళ్లల్లోనే గడపనున్నారు. ఈ సమయంలో సరదా కోసం ద్విచక్ర వాహనాలపై రయ్ మని దూసుకెళ్లేందుకు కొందరు విద్యార్థులు అత్యుత చూపుతుంటారు. తల్లిదండ్రులు పోనీలే అని వదిలేస్తే మాత్రం ఇబ్బందులు తప్పవు. ప్రమాదాల బారిన పడటమే కాకుండా శిక్షపడే అవకాశం ఉంటుందని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అందుకే మైనర్లకు బండ్లు ఇవ్వక పోవడమే ఎంతో మేలని పలువురు సూచిస్తున్నారు. వారందరికీ సరిగా డ్రైవింగ్ రాకపోయినా రోడ్లపై దూసుకెళ్తూ చాలా మంది మైనర్లు పట్టుబడుతున్నారు. ప్రస్తుతం అన్ని ద్విచక్ర వాహనాలు 100 సీసీ కన్నా ఎక్కువే ఉంటడంతో మోటారు వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్ల నిండిన వారు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హులు.

భారీగా జరిమానాలు

మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు ఏ వాహనమైనా నడిపేందుకు అనర్హులు. అటువంటి వారు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే 500 రూపాయలు జరిమానా విధిస్తారు. కేసు నమోదై కోర్టులో ప్రవేశ పెడితే 500 రూపాయల నుంచి 25 వేల వరకు జరీమానా పడే అవకాశం ఉంది. అన్నింటి కంటే ప్రమాదకరమైనది మైనర్లకు వాహనాలు ఇస్తే వాటి యజమానులకు 3 వారాలు జైలుశిక్షతో పాటు పాటు 5 వేల నుంచి 20 వేల రూపాయల వరకు జరీమానా విధించే అవకాశం ఉంది. తల్లిదండ్రుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కూడా చేస్తారు.

అవగాహన లేకే ప్రమాదాలు

డ్రైవింగ్ లైసెన్స్ పొందే సమయంలో రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పరీక్ష రాయాల్సి ఉంటుంది. మైనర్లకు సూచికలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, రోడ్లపై ఎలా వెళ్లాలి తదితర అంశాలపై అవగాహన లేకపోవటం, సరిగా డ్రైవింగ్ రాకపోవటం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడుతుండటం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నాం

అందరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. బాలలకు వాహనాలు ఇవ్వొద్దు. ఒకవేళ ఇస్తే ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదం జరిగితే తల్లిదండ్రులతో పాటు వాహన యజమానికి శిక్ష పడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలి.

– మాధవరావు, ఎంవీఐ, మార్కాపురం

మైనర్లను ప్రోత్సహించొద్దు

ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనాలు వేగంగా నడపటం వల్ల ఇతరులకు ప్రాణసంకటంగా మారే ప్రమాదం ఉంది. 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి.

– మహేష్, ఎస్సై పెద్దదోర్నాల

తహసీల్దార్‌కు వైఎస్సార్ సీపీ నేతల సన్మానం



తహసీల్దార్ మంజునాథరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: కొత్తగా బాధ్యతలు చేపట్టిన స్థానిక తహసీల్దార్ డి.మంజునాథరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, సింగా ప్రసాద్, ఒంగోలు సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, కె.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సయ్యద్ జబీవుల్లా, చెంగళ నాగయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్

పుల్లలచెరువు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం –వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుకుంటే కొన్ని మార్పులు వస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహలు జరుగుతున్నాయని, అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పునరుత్పత్తి సమస్యల గురించి కూడా అవగాహన కల్పించారు. ఆడ పిల్లలు చదువును మధ్యలోనే మానేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. సూపర్‌వైజర్ శివలక్ష్మి, ఐటీసీ ప్రథమ్ కో ఆర్డినేటర్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సమస్యలు త్వరలోనే పరిష్కారం



మాట్లాడుతున్న కేఎంసీ కో ఆర్డినేటర్ శ్రావ్య

పెద్దదోర్నాల: సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలు తొలగించేందుకు చర్యలు చేపతామని డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో నెలకొన్న సమస్యలను వైద్యాధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నెల రోజులుగా ల్యాబ్ టెక్నీషియన్‌లు లేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఆయన సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే ల్యాబ్ టెక్నీషియన్లను నియమిస్తామని తెలిపారు. ఎక్సరే ప్లాంట్, వైద్యశాలలో నీటి ఇబ్బందులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వైద్యాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేఎంసీ కో ఆర్డినేటర్ శావ్య, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ వైద్య సంజీవ్, డాక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: మండలంలోని గంజివారిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన ఇందూరి ఆంజనేయులు కుటుంబాన్ని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, సర్పంచ్ డి.సుబ్బారెడ్డి, వివిధ విభాగాల నాయకులు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, వెన్నా రమణారెడ్డి, గుమ్మ అంజి ఉన్నారు.

భూసారానికి పచ్చిరొట్ట పైర్ల దోహదం

అర్ధవీడు: పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారం పెరుగుతుందని, తద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని ఏఓ ఎస్‌కే మహమ్మద్ తెలిపారు. 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. విడివిడిగా, కిట్ రూపంలో విత్తనాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ మహాలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఆసక్తి ఉన్నవారు 1బి, పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డుతో వీఏఏ వద్ద, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మామిడి, జామ, సపోట, బత్తాయి, నిమ్మ, మునగ తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

భూసార పరీక్షలు వేసవిలో చేయించాలి



మట్టి సేకరణ గురించి రైతులకు వివరిస్తున్న రమేష్

కురిచేడు: వేసవి కాలంలో పంట భూముల్లో మట్టి పరీక్ష చేయించేందుకు అనుకూలమని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ తెలిపారు. మండలంలోని కాటంవారిపల్లెలో శుక్రవారం ఆయన రైతులకు మట్టి పరీక్ష విధానం గురించి అవగాహన కల్పించారు. మట్టి పరీక్ష చేస్తే తదుపరి పంటకు సారవంతమైన భూమిగా అందించవచ్చని పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులు ఎక్కువగా, సేంద్రియ ఎరువులు తక్కువగా వేస్తే భూమి సారం తగ్గి పంట దిగుబడిలోనే గాక పురుగు, తెగుళ్ల ఆశిస్తున్నాయన్నారు. భూమిలో లోపాలు, సారవంతం తెలుసుకోకుండా పంట వేస్తే రైతులు చాలా నష్టపోతున్నారన్నారు. భూమిలోని అన్ని రకాల పోషకాలు (నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, ఇనుము, బోరాన్) కొంతమేర కలిగి ఉంటాయన్నారు. పోషకాలు భూమిలో ఎంతమోతాదు ఉన్నాయో తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలతో సాధ్యమన్నారు. మట్టి పరీక్షలో మట్టి సేకరణ చాలా ముఖ్యమైందన్నారు. రైతు మట్టి సేకరించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే భూసార పరీక్ష కేంద్రం నిపుణులు జీసీహెచ్ నారాయణ తెలిపారు. ముందుగా రైతు ఎంచుకున్న పొలం భౌతిక స్వభావం ఒకే విధంగా ఉందా లేదా అని గమనించాలన్నారు. వేర్వేరు స్వభావాలు కలిగిన భూమి అయితే వేర్వేరు నమూనాలు తీయాలన్నారు. మట్టి సేకరించేటప్పుడు వేరు వ్యవస్థను బట్టి మట్టి సేకరించాలన్నారు. వార్షిక పంటలు వరి, మిరప, పత్తి మరియు కూరగాయల పంటలు కోసం అయితే వీ ఆకారంలో అరఅడుగు వరకు అంచువెంబడి మట్టి సేకరించాలన్నారు. దీర్ఘకాలిక పంటలకు పండ్ల తోటలు, జామాయిల్ తదితర పంటలకు 3–4 అడుగుల వరకు మట్టి సేకరించాలన్నారు. ప్రతి అడుగు లేదా ప్రతి పొర వేరుగా సేకరించాలన్నారు. అర కేజీ కంటే ఎక్కువ మట్టి సేకరించినపుడు దాన్ని గుడ్డ సంచిపై పోసి మట్టి మొత్తాన్ని గుండ్రంగా చేసి 4 సమ భాగాలు చేయాలన్నారు. తర్వాత ఎదురు ఎదురు 2 భాగాలు తీసివేస్తూ ఇలా అరకేజీ మట్టి వచ్చే వరకు చేయాలన్నారు. ఇలా వచ్చిన మట్టిని గుడ్డ సంచిలో వేసి పంట, రైతు పూర్తి వివరాలు, తర్వాత వేయబోవు పంట వివరాలు, సర్వే నంబరు, రైతు పేరు, చిరునామా, ఫోన్ నంబర్‌తో సంచిని తీసుకుని సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని శాస్త్రవేత్తలు వివరించారు. మట్టి సేకరించేందుకు ముందు దాదాపు మూడు నెలల వరకు ఎటువంటి రసాయన, సేంద్రియ ఎరువులు వేయకూడదన్నారు. చెట్ల నీడలో, గట్ల దగ్గర, నీరు పారేచోట, నీరు నిల్వ ఉన్న చోట మట్టిని సేకరించకూడదన్నారు.



మట్టి పరీక్ష చేస్తున్న సిబ్బంది

వాయుపుత్రునికి విశేష పూజలు



వివిధ రకాల పండ్ల అలంకారంలో ఆంజనేయస్వామి వారు

మార్కాపురం: మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో శ్రీభక్తాంజనేయస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ రకాల పండ్లు, పుష్పాలతో స్వామివారి మూల విరాట్‌ను శోభాయమానంగా అలంకరించారు. ఉదయం పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంతోపాటు చింతగుంట్ల, తిప్పాయిపాలెం, నికరంపల్లి, ఎల్‌బీయస్ నగర్, బిరుదుల నరవ తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సేవా సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. రాత్రి కోలాట ప్రదర్శన, పండరి భజన భక్తులను అలరించాయి. .

సచివాలయం తనిఖీ



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పుల్లలచెరువు: నూతనంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియను చాపలమడుగు సచివాలయంలో తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు నమోదును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో రేషన్‌కార్డు లేని వారికి నూతనంగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు పలు సర్దుబాటులు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, గ్రామాల్లోని రేషన్‌కార్డు లబ్ధిదారుల వివరాల్లో తప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఈ విషయాలు గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలన్నారు. వచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ముండ్లమూరు (కురిచేడు): ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీని మండలంలోని శంకరాపురం వద్ద శుక్రవారం ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నిరోధించేందుకు నిరంతరం అప్రమత్తతో జిల్లా అంతటా వాహనాలు తనిఖీ చేపట్టినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ తప్పకుండా ధరించాలనే ఉద్దేశంతో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి జరిమానా విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెట్టు కింద మూగజీవాలు



చెట్టు కింద సేద తీరుతున్న జీవాలు

పుల్లలచెరువు: ఎండలు మండుతున్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడుతుంటే నోరు లేని జీవాల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. శుక్రవారం ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఉదయం 11 గంటలకే జీవాలు చెట్టు వద్ద ఉన్న నీడకు చేరాయి. అక్కడ సరిపోక పక్కనే ఉన్న లారీ కిందకు వెళ్లాయి.

వేడుకగా చెన్నకేశవుని వసంతోత్సవం



స్వామివారి గ్రామోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై అలంకరించి ఊరేగించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు




మహిళల కోలాట ప్రదర్శన

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి, పోతురాజు ఆలయ నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. శుక్రవారం రాత్రి మహిళల కోలాటం ప్రదర్శన భక్తులను అలరించింది.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పలుగుంటిపల్లె మూలమలుపు వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన తొండమల్ల రమణ అనే వ్యక్తి తన బైక్‌పై కంభం వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో పలుగుంటిపల్లె గ్రామ సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. రమణ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌లో గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించినట్లు సమాచారం

డివైడర్‌ను ఢీకొట్టిన టీఎస్‌ఆర్టీసీ బస్సు



డివైడర్‌ను ఢీకొని నిలిచిన బస్సు

మార్కాపురం: తెలంగాణ రాష్ట్రంలోని కోరుట్ల నుంచి పామూరు వెళ్తున్న టీఎస్‌ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం మార్కాపురం పట్టణ శివార్లలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. మార్కాపురం టౌన్‌లోకి వస్తున్న క్రమంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ప్రయాణికులు సరక్షితంగా ఉన్నారు. బస్సు ఫుట్‌బోర్డు మాత్రం దెబ్బతిన్నది. ప్రయాణికులను మరో బస్సులో గమ్య స్థానాలకు పంపారు. ప్రమాదానికి కారణం డ్రైవర్ నిద్రమత్తా..! నిర్లక్ష్యమా..! అనేది తెలియాల్సి ఉంది. బస్సు మరో అడుగు మేర ముందుకు దూసుకెళ్లి ఉంటూ ముందు కూర్చున్న ప్రయాణికులకు ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు.